# ఇంటాయన X ఐదు

ఇంతకీ యిది కథో; జీవితచరిత్రో, లేక ఉత్త చత్త వ్యాసమో తెలీక యిల్లా నామకరణం చేశాను. ఇంటాయననగానే, నేనో స్త్రీననీ ఆయన నా భర్తనీ మాత్రం నిర్ణయించకండి. స్వతంత్ర భారతంలో నేనొక మొగాణ్ణి. నాకొక భార్యకూడా ఉంది. నేనో కొంపలో వుంటున్నాను. దాని ఆసామీ, "యజమాని" – "లాండ్ లార్డ్" ఇంటాయన.

నేనీ పాతికేళ్ళల్లో ఐదుకొంపల్లో ఉన్నాను. కాబట్టి, ఐదుగురు ఇంటాయన్లు గలవాణ్ణి- ఏదో, పిల్లలు గలవాణ్ణన్నట్లు! ఈ మధ్య వో విషయం ఆరాతీశాను. ఈ ఐదుగురు యజమాన్లు, అన్నదమ్ములేనట, ఏంచెయ్యను? "ఇంటాయన X ఐదు" అవక తప్పిందికాదు.

ఇంటాయన సన్నిధానంలో, సర్వస్వతంత్రాలకీ తిలోదకా లొదిలి, బైరాగులై కడుగండ్ల పాలవుతున్న దౌర్భాగ్యపు కాపరాలకున్న వాళ్ళతో ఏకీభవించి, సానుభూతి ప్రకటించి ఇంటాయన్లపై కత్తికట్టి, దెబ్బలూ పత్రికలకి, వ్రాసి వాళ్ళని నిర్మూలన చెయ్యడానికి వొక విప్లవం, వొక రాజకీయోద్యమం లేవదీయ సంకల్పించిన ధీరోదాత్తుణ్ణనుకుంటే మీరు పొరబడుతున్నారు. X గుర్తు, ఇంటి యజమాని పీక కత్తిరించే 'కత్తిరి' నిగూఢ ట్రేడ్‌మార్క్ ఉద్యమ 'చిహ్నం' అనుకోవద్దు. నా కట్లాంటి అనాగరీకమైన, ప్రాచీనకొండ మనుషుల భావాలులేవు.నేను ఆధునికుణ్ణి; అంటే స్వార్థపరుణ్ణి. నా సమస్య వేరు.

ఐదుగురు ఇంటాయన్ల విషయం క్లుప్తంగా చెప్పివేస్తే నా స్వార్థపరత్వం ఎట్లాంటిదో మీకే తెలుస్తుంది. మొదటాయన పేరు పంచేంద్రియం. ఆయన్ని నేనెప్పుడూ చూళ్ళేదు. అసలాయన్ని చూసినవార్ని కూడా నే చూళ్ళేదు. ఆయన ఏ దేశంలో వుంటాడోకూడా చాలామందికి తెలీదు. నిజంగా ఆయన బ్రతికే ఉన్నాడంటే కాస్త సందేహిస్తాను. మరి అద్దె ఎవరికివ్వను?

"ఈ గృహం నాది; నేనే యింటాయన్ని, అద్దె నాకియ్యి" అని ఆంధ్రదేశంలో ఒక్కరూ నాతో అన్లేదు. నాకు సిగ్గేసింది. అద్దె లేకుండా ఎట్లా వుండను? "నీచుడా – సిగ్గులేదూ? ఫో వెళ్ళు. దేవుడికోసం తీర్థయాత్రలు చేస్తావు; ముక్తికోసం ఆసనాలేస్తావు; మోక్షంకోసం జపం చేస్తావు. ఇంటాయన్ని కనుక్కోలేవు? ఫో... ఖాళీచెయ్యి. అద్దెపుచ్చుకునే మహానుభావుణ్ణి వెదుక్కో –" అంది అంతరాత్మ తక్షణం ఖాళీ చేశాను, ఐదేళ్ళ తర్వాత.

రెండో ఆయన పేరు పంచప్రాణం. నేనంటే ఆయనకి పంచప్రాణాలూను. ఆయనది పెద్ద యిల్లు. అసలు యిళ్ళల్లో "పెద్ద"ంటూ లేవంటేనే చెప్పలేను. ఇంటి వైశాల్యం కుటుంబ విస్తీర్ణతనుబట్టి ఉంటుందని ఇక ఇటలీ వాస్తు శాస్త్రకారుడన్నాడు. సంతజనంగల కుటుంబానికి గవర్నర్‌గారి భవనం ఇరుకే. మేము లింగులింగుమంటూ యిద్దరం.

అందులోనూ మా ఆవిడ మంచంబద్దీ అంత మనిషి. పెద్ద హాల్లో కుర్చీలో కూచుంటే కనబడదని మూలగదిలో చాపేసి కూకుంటుంది. ఆ యింటికి అన్ని హంగులూ ఉన్నవి.

ఆ యింటిలో మా ఆవిడెక్కడుంటుందో ఎవరేనా చెప్పగలిగితే సగంవాటా అద్దికిస్తారు. ఇంతకీ ఇంటాయనకీ నాకూ పేచీ, సగంవాటా అద్దెకివ్వడంలో వొచ్చింది. ఇల్లు అంతే అనుకోండి. దాన్ని నాలుగెట్టి గుణించండి. ఎందుకంటే అది నాలుగంతస్థుల మేడ. "ఇంతిల్లు నాకెందుకయ్యా, కింద వాటాలో మేముంటాం. మిగతాది ఎవరికేనా, మీ ఇష్టం వొచ్చినవాళ్ళకి – ఇన్సూరెన్సు ఏజంట్లకి తప్ప – యివ్వండి." అని ప్రాధేయపడ్డాను; బ్రతిమిలాడాను.మాపై అధికారిచేత వ్రాయించాను. ప్రధానమంత్రి అంతరంగిక సెక్రటరీచేత చెప్పించాను. రెంట్‌కంట్రోలర్‌తో ఫిర్యాదు చేశాను. టౌన్ ప్లానింగ్ కమిటీకి వ్రాశాను. ఎసెంబ్లీలో బిల్లు ప్రతిపాదించమని మెంబర్లని కోరాను. ఇన్ని చేసినా మా పంచప్రాణంగారు వినలేదు.

"నువ్వుంటే నాకిష్టం. హాయిగా అనుభవించు. వాళ్ళకీ వీళ్ళకీ యివ్వడం నాకిష్టంలేదు. వాళ్ళకి యిళ్ళల్లో కాపరం ఎల్లావుండాలో చేతగాదు. నువ్వు గొప్ప కాపరంగాడివి."

అంటూ నవ్వేసి వెళ్ళిపోయాడు. ఏం చెయ్యను? మా ఆవిడ ఒక సలహా యిచ్చింది. "మూడు వాటాలు ముగ్గురికి అద్దెలకి మనమే యిచ్చి ఆ డబ్బు వసూలు చేసుకుని హాయిగా ఆనందిద్దాం. అదే మార్గం" అంది.

బుద్ధి గడ్డి తిని, ఆ సలహా అంగీకరించి, ముగ్గురి వాటాదార్ల కోసం దేశం గాలించడం సాగించాను. చిత్రం, వొక్కడూ రాలేదు. అద్దె లేకుండా వచ్చి కాపరం వుండాల్సిందోహో" అని టముకు వేయించాను. జనం రాల్దేదు. ఇదేదో కుట్ర అనుకున్నారుట.

"నువ్వు యింటి యజమానివా?" అని అడిగారు జనం.

"కాను."

"మరి అద్దికిచ్చేందుకు నువ్వెవడవు?"

కాబట్టి పంచప్రాణంగారే శరణ్యం. ఆఖరికి వొళ్ళుమండి, మిగతా యిల్లు మరొకళ్ళకి అద్దెకివ్వకపోతే, యిల్లు ఖాళీ చేయాల్సి వస్తుందని బెదిరించాను, తక్షణం ఖాళీచేశాను – ఐదేళ్ళకి.

నా మూడో ఇంటి యజమాని పేరు పంచమహాపాతకం. ఆయన చేసిన అపచారం యేమీలేదు. ఆయనింట్లోనే కాపురం ఉన్నాను. అది బాగా పాతిల్లు. హిందూదేశ చరిత్ర జాగ్రత్తగా, వొళ్ళు దగ్గర బెట్టుకుని చదివినవాణ్ణికాను; అంచేత ఆ యిల్లు యేకాలం నాటిదో నేను నిర్ణయించలేను. ఇక్ష్వాకుల నాటిదా? ఏమో! రాములవారు సీతాదేవి అరణ్యవాసం చేసిన నాటిదనడానికి తార్కాణం వుంది. ఆంజనేయులు లేక అతని అనుచరులు, ఆ యింట్లోనో, లేక ఆ యిల్లు ఉన్న స్థలంలోనో, ఆ వొక్క పుట్టినా మకాం చేసివుండాలి. ఎంచేత నంటారా?

మా యింటిమీద వో డజను కోతుల బృందము విడిది చేస్తాయి. దేశంలో ఉన్న కీటకజాలం మచ్చుకొకటి చొప్పున చూరును అంటిపెట్టుకొని వుంటుంది. సృష్టికి పూర్వం, జీవకణువులోంచి ప్రథమ ప్రాణి ఉద్భవించి, వివిధరూపాలుగా పరిణామం చెంది, తుదకు మానవుడుగా అవడం వరకూ జరిగే ప్రాణుల జీవిత నాటకంలోని మధుర ఘట్టాలన్నీ మావొక్క వంటింట్లోనే తిలకించవచ్చు. ప్రకృతికి "కళా" ప్రాతిపదికన్నట్లే, ఆ ప్రాచీన, ప్రాకృతిక వైభవానికి మా ఆవిడ ప్రకర్షించిన శిల్పనైపుణి, కళా చమత్కృతి, నూత్న వైభవాన్నీ, ఒక కొత్త చైతన్య శృంగారాన్ని ఆపాదించిందనడం సమంజసం. కుంపటికోసం ఉద్దేశింపబడ్డ బొగ్గులు అందులో తప్ప, ఇల్లంతా తాండవిస్తాయి. వృద్ధనారి తలలో నెరసిన శిరోజములవోలె, బూజులు ఇంద్రజాలాన్ని అల్లుతాయి. ఓహోహో ! ఏం వైభవం! ఏ మూల చూసినా చినిగిన బట్టలే, ఏకింద చూసినా దుమ్ము, దుట్ర, దూగరా; ఏవైన చూసినా, ప్రచండ అగ్నిజ్వాలా నీడలే! ఏమని వర్ణింతురా, ఎట్లు వర్ణింతురా, నా త్యాగరాజా!

పంచమహాపాతకంగారితో ఒకటేచిక్కు. ఆయన చాలా మంచివాడు. చెడ్డవాళ్ళని గురించి అడ్డమైనవాడూ లెక్చర్లు దంచుతాడు గాని, మంచివాళ్ళవల్ల దేశానికి, మానవాభ్యుదయానికి జరిగే హానిని గురించి, సంక్రమించే అరిష్టాన్ని గురించీ, ఒక్క వాజమ్మా నోరు పెగల్చడేం! మరి నా వొళ్ళు మండుతోంది. లేకపోతే పంచమహాపాతకం అల్లా అనగలడూ! నాయినా, నీకు మరో కొత్త యిల్లు కట్టించి యిస్తాను. అంతవరకూ యీ ఇంట్లో ఎల్లానో రోజులు వెళ్ళబుచ్చు" అన్నాడు.

"ఇంతద్దె యిచ్చుగుంటూ అంతవరకూ ఈ ఇంట్లో వుండమంటావుటయ్యా" అన్నాను.

ఆయన వొక్క మహాపాతకం మాత్రం నవ్వినట్లు నవ్వాడు. "ఇట్లాంటిల్లు ఎల్లా కట్టించావు? ఎప్పుడు, ఎవరు కట్టించారు?" అంటూ ప్రశ్న పరంపర కురిపించాను. "ఈ ఇల్లు నాదికాదు. మరొకరి దగ్గర అద్దెకుచ్చుకున్నా మీకోసం. నేను కట్టించే యిల్లు నెలరోజుల్లో పూర్తవుతుంది. అంతవరకూ ఎల్లాగో గడపండి. ఈ ఇంటికి మీరు అద్దెకూడా యివ్వొద్దు. నేనే యిచ్చుగుంటాను" అని వెళ్ళిపొయ్యాడు ఆయన. ఏం చెప్పమంటారు? ఈయన కథ ఇల్లా వుంది. నా కిదేదో పన్నాగంలా కనబడసాగింది. ఇంత మంచివాళ్ళుండటం, నిజంగా దేశానికి నష్టం. మంచితనం పైనేదైనా పన్నుంటే బాగుండుననిపించింది. నాకు పుట్టబొయ్యే అబ్బాయికి, వాళ్ళమ్మాయిని యిద్దామన్న యత్నం కాదు గదా కొంపతీసి! పోనిద్దురూ, తీసేటందుకు మనకి కొంపెక్కడేడిసింది అని మా ఆవిడ తన జన్మకల్లా ఒక్క ఛలోక్తి నామీద ప్రయోగించి బొగ్గుల నృత్యానికి బూజుల గజ్జకట్టి కాలనికట్టెల చుంమ్ చుంమ్ సంగీతంలో శృతికలుపుతూ, గరిటి సంబరంలో నిమగ్నురాలైంది.

నా బుర్రలో – బూజు దులిపింతర్వాత సుమాండి – ఒక గొప్ప భావం ప్రవేశించి, స్థావర పడింది. వెంటనే ఆచరణలో పెట్టాను. అచ్చాఫీసుకెళ్ళి కొన్ని ఆహ్వానపత్రాలు అచ్చొత్తించి తీసుకొచ్చాను.

"అయ్యా! అమ్మా, నేడు సాయంత్రం 4 గంటలకి మర్కట లగ్నమున నేనూ, నా సతీమణియు మా యింటి యజమాని మా కోసం కుదిర్చిన గృహంలో, గృహాలంకరణ మహోత్సవం జరుపుటకు పెద్దలు నిశ్చయించిరి గావున, ఏతత్శుభ ముహూర్తమునకు తాము యధా పరికరములతో విచ్చేసి, ఉత్సవము జయప్రదముగా సల్పి, మదర్పిత బొగ్గు, బూజు, దుమ్ము, దుష్ప, కీటక సంపదనుగైకొని మమ్మానందింప జేయకోరుచున్నాడ.

షరా "మీమీ తట్టీలు, చీపుళ్ళు, గంపలు, జల్లెడలు మీరే తెచ్చుకో ప్రార్థిదులు."

ఆహ్వానాలు ఓ యాభై అడ్రసులు వ్రాసి సిద్ధం చేశాను. అది చూసి మా ఆవిడ ఆనందానికి మేరే లేదు. ఆకస్మిక ఛాయాచిత్రంలాగ చేతిలోగరిటని మూల పడవైచినదై, సంభ్రమముతో అరుదెంచి ఇట్లు చెప్పదొడంగె;

"ప్రభూ, నాచేత కాదగినకార్యకలాపమంతయూ, పలువురు పురప్రముఖులకి పంచుట మీ ఔదార్యము చాటుచున్నది. రేపీపాటికి మన గృహ మెట్లుండునో వూహింప నోపునె!"

ఊహించడంలో నిమగ్నులమయ్యాము. అహహ! మా ఆహ్వానాలు అందుకోగానే స్నేహితులు, బంధువులు ఒచ్చేసి ఇల్లంతా శుభ్రపరుస్తారు. ఎవరెవరికి ఏమేం పనులు పురమాయించాలో నిర్ణయంచేసుకున్నాను. నా మిత్రుడు శరభయ్య మాసిన బట్టలన్నింటినీ ఒక దరికి చేరేసి, బొత్తిగా పనికిమాలిన వాటికి నిప్పు పెడతాడు.

కృష్ణావతారం చినుగులు కుడతాడు. రాఘవమ్మగారు దుమ్మెత్తి పోస్తారు. హనుమాయమ్మ గారికి తేలువిషం ఎక్కదుట. అందుచేత తేళ్ళని చంపి పోగుచెయ్యడం ఆవిడపని. మరి బూజులో - నాప్రాణ స్నేహితుడు గురుమూర్తి. బూజుల విషయంలో వాడు కేవలం పరమాత్ముడే - సిగరెట్టు పొగతోనే వాటిని భస్మీభూతం చెయ్యగల్డు. అతని సతీమణి, రమణమ్మ గారు ఆమె కోమలహస్తంతో ఆ బొగ్గుల మసిని తుడిచివేస్తుంటే, ఒహోహో!

నేనో పాతికా, ఆవిడో పాతికా - రమణమ్మగారు కాదు, మా అవిడన్నమాట - ఆహ్వానాలు తీసుకుని, నలుగురికీ స్వయంగా యిచ్చి పిలవడానికని వూళ్ళోకి బయలుదేరాము. ఇంటికొచ్చేటప్పటికి మధ్యాహ్నం మూడున్నర దాటింది. అతిథులందరూ మరో పావుగంటలో ఏతెంచనున్నారు. అమితోత్సాహంతో కొంపలోకి తలుపుతీసి ప్రవేశించాం గదా, మమ్మల్ని ఎదుర్కొన్న దృశ్యం ఎట్లాంటిదని మీవూహ!

ఇల్లంతా శుభ్రంగా, అద్దంలాగ చేసేశారు ఎవరో, మడత దుప్పటి లాగ ప్లాస్క్‌లో వ్యాక్యూమ్ గ్లాస్‌లాగ, ముత్యంలాగ, చంద్రుడిపై తెల్ల మేఘంలాగ ఇల్లంతా కడగబడి, ముగ్గులెట్టబడి, అలకబడి, సున్నం కొట్టబడి, సూర్యోదయంలా గుందంటే నమ్మండి. దొడ్లోనుయ్యింది లెండి. నా సంకల్పం మా గురుమూర్తిని అందులో దించి నీళ్ళు తీయించాలని; అదొక మహత్తరమైన దిగుడు బావి. భూగోళశాస్త్రం పరీక్షలో యిట్లాంటి ప్రశ్న అడుగుతుంటారు. "నూతిలో చేదవేస్తే, న్యూయార్కు పట్నంలో ఆచేద తేలింది. దీన్ని బట్టి ఆ నుయ్యి ఏ పట్నంలోదో కాకపోయినా ఏ దేశంలోదో చెప్పుకోండి? మీకిచ్చిన ప్రపంచ పటంలో ఆ పట్నం దగ్గర గుర్తుపెట్టండి" అని అడుగుతారు. దానికి సమాధానం

మా దొడ్లో నుయ్యి. ఇల్లంతా శుభ్రం చెయ్యడం కాకుండా ఆ నూతిలోంచి నీళ్ళుతోడి, అరడజను గంగాళాలు నింపారు ఎవరో. ఈ దురంతం చేసిందెవరు? ఎవరైనా క్షమార్హులుకారు. క్షణంలో నలుగురు అతిథులూ వొస్తారు. నా పనేంగాను! ఎంత పరాభవం! ఏదీ మీ బొగ్గుల దొంతరంటే ఏం చెప్పను? బూజులేవమ్మా అంటే మా ఆవిడే మనగల్దు? అన్నీ గతించినై. ఆ తేళ్ళ పరంపరలు, ఆ బొజ్జింకల వయ్యారపు సముదాయము; ఎలుకల మందహాసము; సాలీండ్ల మూగతపస్సు; మాసిన బట్టల స్థానచలనము – అన్నీ నశింపు. మా ది కేదిక్కు? ఏది దోవ? నేను మా ఆవిడా గోదావరీ, కృష్ణా ఈ రెంటిలోనూ ఎవరు ఎందులో పడటమా అనే విషయం తర్కించుకుంటుండగా ఒక చిరునవ్వు వినిపించింది. ఒకటికాదు, రెండు చిరునవ్వులు. వాటిని ఉద్భవింపచేసినవారు పంచమహాపాతకంగారు, ఆయన సతీమణి.

"మీరు పడుతున్న అవస్థ చూడలేక, మీరు యింటిలో లేని సమయంలో నేనే యిదంతా శుభ్రం చేయించాను. మన కొత్తిల్లు వారంలో సిద్ధంకాబోతోంది. ఈ వారం యిక్కడే నిశ్చింతగా గడపండి" అన్నాడాయన. ఏనాడు నామకరణం చేశారో పెద్దలు. ఆయన్ని తల్చుకుంటే పంచమహాపాతకాలు పట్టుకొని, ఎముకల్లోకి జీర్ణించి పీడించి, మసిచేసి వొదలిపెడతాయా అనిపించింది. పైగా ఆ చిరునవ్వు చూడండి!

"ఇలా నాతోరండి" అని నన్ను వీధిలోకి తీసికెళ్ళాడు.

"అల్లా పైన చూడండి."

చూశాను.

ఏమీ కనబళ్ళేదు.

"ఇంతేనా మీ జ్ఞాపకం ఇదివరకెన్ని కోతులుండేవో మరచి పొయ్యారా తరిమేశాను."

దాంతో కత్తి నా గుండెల్లోకిపోవడం, మెలి తిప్పడం సమాప్తం. ఈ నీచుడితో నాకేలా.... ఛీ. అనుకుని, ఆ సాయంత్రం యిల్లు ఖాళీ చేశాను – అంటే నా వారాంతం వో సాయంత్రం అన్నమాట.

ఇహ మా నాలుగో యింటాయన్ని గురించి చెప్పటానికి నాకు ఓపికా లేదు, ఉన్నా తీరుబడి లేదు. ఎంచేతనంటే, ఆయనింటిలో నే నున్నది సరిగ్గా మూడు గంటలు, వివరాలు నాకు బాగా జ్ఞాపకంలేవు. ఆయన వ్రాసిన ఉత్తరం ముక్కచూసుకుని నేనూ మా ఆవిడే ఒక రెండెడ్ల బండిలో సామాన్లు వేసుకుని మరో ఒంటెద్దు బండిలో మేం ఎక్కి అడ్రసు ప్రకారం ఒక యింటి ముందు దిగాం. వీధి గుమ్మం మూసి వుంది. ప్రక్కన బుల్లి కిటికీ వుంది – ఎంతలెండి యుద్ధ కాలంలో వచ్చిందే అగ్గిపెట్టి – అంత; – ఆ కిటికీలోంచి ఓయాభై తలలు తొంగిచూశాయి.

"ఖాళీలేదు వెళ్ళండి మేం వచ్చేశాం" అని బృందగానం సాగించాయి.

"నేను యింటికోసం రాలేదు, ఇంటాయన కోసం వొచ్చాను" అన్నాను నమ్రతతో.

"ఆయన పేరు?" అన్నాయి ఓ అరడజను తలకాయలు.

"పంచాంగం" అన్నాను.

ఆ తలకాయలు నవ్వి నవ్వి మాయమయ్యాయి. మా యింటాయన పేరు పంచాంగం. దానికి నేనా బాధ్యుణ్ణి. వారింట్లో కాపురం వుంటూ, ఆయన పేరు చెప్పేటప్పటికే విరగబడి నవ్వడమా? ఎంత అన్యాయం!

పంచాంగంగారు ఆ వెనకవీధిలో వుంటున్నారు. బళ్ళు వెనక్కి మళ్ళించి, పంచాంగం గారింటికి చేరుకున్నాం. ఆయన అరుగుమీద కూర్చుని చుట్ట నములుతున్నాడు. ఆయన మీదికి తారాజువ్వలా వెళ్ళాను.

"ఏం పనయ్యా ఇంట్లో ప్రవేశించమని అంతక్రితమే మరొకర్ని ఆ ఇంటిలో ప్రవేశపెడతావా. ఇదేనా పెద్దమనిషితరహా. చూడు నీ విషయం కనుక్కుంటాను" అన్నాను. అంటే అచ్చంగా యింత కఠినమైన మాట ప్రయోగించలేదనుకోండి. తత్తుల్యమైన భావం ప్రకటన చేశాను. పంచాంగం చుట్టతీసి నవ్వి, "ఒసే" అని కేకేసి, పడక కుర్చీవేసి కూర్చోమన్నాడు. సగం పంచాంగం – (అంటే ఆయన భార్యలెండి) మరచెంబు; గ్లాసుతో మంచినీళ్ళు తెచ్చింది. వీధిలోకెళ్ళి మా ఆవిణ్ని బండిలోంచి దించి, లోపలికి తీసుకెళ్ళి కాళ్ళు కడిగి పసుపుపారాయణ పూసి, హారతిచ్చింది. అరిసెలు, అప్పాలు, అరడజను మొక్కజొన్న పొత్తులు వెండి పళ్ళెంలో తెచ్చి నా ముందు పెట్టింది.

"ఇదిటయ్యా నువ్వు చేసేపని. చెప్పేదొకటి చేసే దొకటినా?" అన్నాను, కోపం దిగమింగుకోలేక.

"తరువాత మనవిచేస్తా, ముందు భోంచెయ్యండి" అన్నాడు పరమ పంచాంగం.

నేను ఫలహారం చేస్తున్నా, సంస్కారం, నాగరికత గల ఆధునికుణ్ణి కాబట్టి. మరోడైతే ఆ పొత్తులు ఆయన మొహానకొట్టి మరీ వెళ్ళును.

"మీకు రాసిన ఉత్తరం ఆయనకి వెళ్ళిందట. ఆయనదీ మీదీ వొకటే పేరుట. మీరు మళ్ళా రెండు మూడుత్తరాలు వ్రాశారు. ఓ వేళ నా ఉత్తరం అందలేదేమో అని మళ్ళా మొన్న వ్రాశాను. ఆ ఉత్తరం సరిగ్గానే చేరిందన్నమాట. పోస్టువాడు యిప్పటికేనా నిజం తెల్సుకున్నందుకు సంతోషించాల్సిందే."

"పేరువొంకని ఆ యాభై తలకాయలి కుటుంబంగాడు అందులో ప్రవేశిస్తాడా? వాన్ని బైటికి తోలెయ్యలేరూ, యింటి యజమాన్లుగా" అన్నాను.

"పోనిస్తురూ పాపం. ఇల్లులేక ఎంత అవస్థ పడుతున్నాడో"

"నా వొళ్ళు మండడం సాగింది. చూడండి, స్వార్థరాహిత్యం వల్ల ఎంత కీడు వాటిల్లుతోందో.

"మరి నా మాటేం చెప్పారు?"

"భగవానుడి కృపుండాలిగాని, అన్నీ చక్కపడతై. నేనన్నీ ఏర్పాటుచేస్తాగా."

"మీకు మరో యిల్లుందా?"

"మీ కెందుకు, ఆ సమస్య నాకు విడచిపెట్టండి" పంచాంగం వీధిలోకెళ్ళి నలుగురు ఉక్కులాంటి మనుషుల్ని పోగుచేసి, బండిలో సామానంతా, యింటిలో పెట్టించాడు. నాకర్థంకాక ఆశ్చర్యంతో చూస్తూ అరిసెలు తింటున్నాను.

ఇంటిలోంచి, తన సామాన్లు వొక్కొక్కటే, వీధిలోకి చేరుస్తున్నాడు మంచాలు, బల్లలు, కవ్వం; రోకలి, రెండుజల్లెళ్ళు, ఐదు ట్రంకు పెట్టెలు, గంపలు, మాసినబట్టల మూటలు సర్వమూ బైట జేరేయించాడు. మేం దిగిన రెండెడ్ల బండిలో పెట్టిస్తున్నాడు.

"ఒకసారి తమరు లోపలికి దయచేస్తారా – కాస్త శ్రమనుకోక" అన్నాడు.

అదంతా స్వప్నంలాగుంది. లోపలికెళ్ళాను. నలుగురు ఉక్కుమనుషులు, ఆయనా కలిసి మధ్యహాల్లో భోషాణాన్ని కదల్చడానికి యత్నిస్తున్నారు. నన్నూ వొక చెయ్యి వేయమని అడిగాడాయన. "ఇవన్నీ ఎక్కడికి చేరేస్తున్నారు?" అన్నాను.

"నేను నిజాయితీగల పెద్ద మనిషిని. ఆడినమాట తప్పను. మీకు ఇల్లు యిస్తానన్నాను. యిచ్చి తీరుతాను. మీరు మా యింటిలో వుండండి –?"

"మీరో –"

"నా మాటకేం. భగవానుడున్నాడు. ఏ చెట్టునీడకో చేరుకుంటా – యిల్లు మెల్లి మెల్లిగా అదే దొరుకుతుంది" అన్నాడు ఆయన.

ఇదేం కర్మ!

"అల్లా వీలులేదు. నలుగురూ ఏమనుకుంటారు?"

"ఏమనుకుంటారు, అద్దెకోసం యజమాని వనవాసం చేస్తున్నా డనుకుంటారు. అసలందుకే యిల్లు కట్టుగోడం. తమకి తెలియందేముందిలెండి పోనీ భోషాణం యిక్కడే వుంచుతాను. తమరే వాడుకోండి."

ఆ చివరి వాక్యంతో, నా పొత్తికడుపులో బల్లెం గుచ్చినట్లైంది.

"ఇంకా నయం. మీరే వుండండి. నేను మా ఆవిణ్ణి పుట్టింటికి పంపేసి, ఏదో హోటల్లో గడుపుతాను" అన్నాను.

అల్లా ఎంతమాత్రం వీలులేదు. పైగా మీ యిష్టమా! భగవానుడి ఆజ్ఞ వుండాలండోయ్...."

నేను వంటింట్లోకెళ్ళి మా ఆవిణ్ణి బరబరా యీడ్చుకొచ్చి వొంటెద్దు బండిలో ఎక్కించాను.

"ఎక్కడికి ప్రయాణం?" అన్నాడు.

"ఇప్పుడే నదిలో స్నానంచేసి వొస్తాం. తోల్రా బండి" అనడంతో బండి కదిలి, అప్రతిష్టపాలవడం తప్పించుకున్నాం. నదిలో స్నానానికని ఆయనతో చెప్పినా, నాకు మళ్ళా యివతలకొచ్చే సంకల్పం లేదు. అట్లాంటి సందర్భంలో ఆత్మహత్య తప్ప, మరి గత్యంతరం లేదు. పంచాంగం అన్నట్లు యివన్నీ మనిష్టమా – భగవానుడి ఆజ్ఞ కావాలి. అంచేత ఆత్మహత్యలాంటి వెర్రి వెర్రి వేషాలెయ్యక, తిన్నగా ఆవిడను పుట్టింటి కంపి, నేను హోటల్లో మకాం చేశాను.

ఇది 1946 మాట పంచభూతంగారింట్లో కొత్త కాపరం – నేనూ మా ఆవిడా, వంటమనిషి, పసిపిల్లా, రెండుపిల్లులూ. అద్దె పాతిక రూపాయలు. అన్ని విధాలా మంచిల్లు. పంచభూతంగారు పక్క వీధిలో వుంటున్నారు. పేరాలు లేకుండా కులాసాగా సంవత్సరం గడిచిపోయింది. 1947 ఆగష్టు వచ్చింది.

దేశానికి స్వతంత్రంవొచ్చింది. నాకూ వో ఆడపిల్ల – ఎంతకాలం వూరుకుంటుంది చెప్పండి – కలిగింది. భూములు పుష్కలంగా పండాయి; ఉద్యోగం పెద్దదయింది. చేతిలో బోలెడంత డబ్బు, మనమే యిల్లు కడదాం, ఎంతకాలం అద్దెకొంపలు. పట్టుమంది కూడా,

మా ఆవిడ. దేశ విభజనా, కాందిశీకుల సమస్య బయలుదేరిన సంగతి మీరందరూ ఎరుగున్నదే. ఒక్కసారిగా దేశం అంతటా అద్దెలు పెరిగినయి. ఒకటోతారీకున అద్దె యివ్వడానికి పంచభూతంగారింటికి స్వయంగా వెళ్లాను. ఆయన నలభై చేసినా యివ్వడానికి సిద్ధంగా ఉన్నాను. అబ్బే, ఆయన విషయం ఎత్తలేదు. వెడుతూ వెనక్కి తిరిగి అన్నాను.

"మరి... మరి... అద్దిమాట?"

"ఇస్తిరిగా...."

"ఆ.... సరె...." అని నవ్వుకుని వెళ్ళిపోయాను.

తర్వాత వారంరోజుల్లో మా ఇంటిని కొంత మరమ్మతు చేశాడు, ముందులాంటిది; వెనక "అవుట్ హౌస్" సరంబి, గిలాబా, అరెకకాచెట్లు. బుల్లితోట, అందులో విహరించే పక్షులు, అవి బైటికి పోకుండా చుట్టూ వైర్ నెట్టింగు.

యాభై యివ్వొచ్చునని నిర్ధారణ చేసుకున్నాను. ఆ నెల ఆయనే మా యింటి కొచ్చాడు. వందరూపాయల నోటిచ్చాను. పాతికా తీసుకుని మిగతా డబ్బిచ్చేశాడు.

"చాలా బాగుంది ఇల్లు యిప్పుడు" అన్నాను.

"ఏదో – చేయించాను. మీకు సంతృప్తి గలిగితే అదే చాలు."

"మరి అద్దిమాటో"

"మామూలే"

"ఎక్కువ చెయ్యరు?"

"చెయ్యను."

"అందరూ చేస్తున్నా."

"వాళ్ళకు మతుల్లేవు. ఇచ్చేవాళ్ళకి గతుల్లేవు."

"మీరు బోలెడు డబ్బు యింటిమీద పెట్టారు. అది రాబట్టుకోరు?"

"నా యింటిమీదే ఖర్చు పెడుతున్నాగాని, వూళ్ళోవాళ్ళ యిండ్లమీద కాదుకదా."

"మీరు అనుభవించడం లేదుగా."

మీరనుభవిస్తే, నే ననుభవించినట్టు కాదు?"

ఈ పెద్ద మనిషి నేం జెయ్యమంటారు? బోలెడు మంది పిల్లాజెల్లా పైగా, ఎట్లా గడుస్తుంది. నాకు జాలేసింది.

మరుసటి నెలలో వారింట్లో ఏదో కార్యం వొచ్చింది. నేనూ వెళ్ళాను. వొచ్చేస్తూ అన్నాను.

"నా మనస్సు వూరుకోడం లేదు. మీరు అద్దె ఎక్కువ చెయ్యాలి."

"చెయ్యను."

"బాగా ఆలోచించండి, రోజులు బాగాలేవు. మీకు గడవదు."

"అందరికీ గడిచినట్లే నాకూను."

"అప్పులపాలై పోతారు."

"దైవకృప"

రామదాసులా నటిస్తాడేం, ఈ పంచపిశాచంగాడు? నాకు నిద్ర పట్టడంలేదు. బెంగతో మా ఆవిడ మంచాన పడింది. వాళ్ళింట్లో కథలూ, కార్యాలూ జరిగినప్పుడు, బహుమతులు రూపేణా వారికేదో ముట్టచెబుదాం. బెంగెట్టుకోకు; లేచి, తిరుగు – అని ఆవిణ్ణి వూరడబెట్టాను.

ఇంతలోకి మా అదృష్టవశాత్తు హైదరాబాదు సమస్య చక్కా వచ్చింది. దేశంలో అందరూ, అద్దెలు నాలుగింతలు చేసి వూరుకున్నారు.

మా ఢాకినీ భూతంగారు మాత్రం, అణాకూడా పెంచలేదు. నాకో భావం తట్టబోయి మానేసింది. అదేమిటో తరవాత మనవి చేస్తాగా.

మీ కిదంతా చదవటం విసుగని నాకు తెల్సు. కాని ఏం చెయ్యను? ఈ నా విషాదగాధ విసుగెత్తించిందంటే ఆశ్చర్యమేమిటి? పైగా నగ్న సత్యం ఈ రోజుల్లో ఎవరికి రుచిస్తుంది చెప్పండి. ఇంతవరకూ వోపిగపట్టినవారు, ఈ కాస్త్రా చదివెయ్యండి మరీ. అట్టే యిదవక! ఇదే రసవత్తర ఘట్టం.

మూడునెల్ల క్రితం, అమాంతం మా ప్రక్కింటాయన మా యింటి కొచ్చి లబోదిబోమని బుర్ర మా కొత్తగా సున్నం వేసిన గోడకి కొట్టుకున్నాడు. ఏమిటయ్యా కథ అని అడిగాను.

"ఇంకేముంది? చిప్పా, కర్రా చేతికివ్వండి" అన్నాడు.

"నిదానించి చెప్పండి – మా గోడ చెడిపోతుంది."

"ఏం చెప్పమంటారు? మా యింటాయన అమాంతం అద్ది నాలుగింతలు చేశాడు."

ఏం చెప్పమంటారు. హైడ్రోజెన్ బాంబ్ తయారయింది. అందుకుట."

"ఎంత ధన్యుడవయ్యా – పిచ్చివాడ, సంతోషంతో పార్టీ యివ్వడంపోయి యిల్లా బెంబేలెత్తి ఎవరేనా ఏడుస్తారా! లే, లే వెళ్ళి మొహం కడుక్కో" అని ఆ దీనుణ్ణి పంపించి వేశాను బుజాన తువ్వాలు వేసుకుని, తొందరగా పంచభూతంగారింటి కెళ్ళాను.

"ఏమండోయ్ – ఇహ మీరు వూరుకుంటే లాభం లేదు. కొంప మునిగింది.

"దొంగలు గోడకి కన్నాలెట్టారా – పోనీలెండి, మళ్ళా గోడ లెట్టిద్దాం – ఈసారి డిస్టెంపర్ చెయ్యించి, ప్లాస్టిక్ షీట్స్ వేయిస్తాగా."

"అదికాదయ్యా, హైడ్రోజన్ బాంబ్ తయారైందిట."

"అవుతే!"

"మీరు అద్దెక్కువ చెయ్యరూ?"

"దానికీ దీనికి ఏం సంబంధం?"

"బాగానే వుంది ఒక్కబాంబ్‌తో మీ యిల్లు భస్మం అవుతుంది. అది జరిగేలోపలే, మీ పెట్టుబడి సొమ్ము రాబట్టుకోవాలి. అంచేత దయచేసి యింటద్ది వంద చెయ్యండి" అని బ్రతిమిలాడాను.

భూతం వికృతంగా నవ్వడం సాగించాడు. "పిచ్చివాడా బాంబ్‌లేస్తే, నేనూ, నువ్వూ మాత్రం వుంటామా? డబ్బుంటుందా? అందరం దుమ్ములో కలిసిపోతాం. వెళ్ళండి! వెళ్ళి రోజూ భగవద్గీత పారాయణ చెయ్యండి."అన్నాడు. నేను సిగ్గుపడి, కొంపకి చేరుకున్నాను.

ఇందాక అన్నానే ఒక భావం వొచ్చి మానేసిందని, ఆ భావం ఈసారి లోపలికి జొరబడింది. అదేమిటంటే ఈ సమస్య అంతర్జాతీయ సమితిముందు పెట్టి న్యాయం పొందుదామని, వెంటనే ఒక ప్రణాళిక తయారుచేశాను. అందులో నిబంధనలు చూడండి.

1. ప్రతి యింటి యజమానీ ఇల్లు అద్దెకు ఇవ్వబడదని బోర్డుకట్టాలి.

2. ప్రతి నెలా కాకపోయినా ప్రతి సంవత్సరమూ ఇంటద్దె ఎక్కువా చేసితీరాలి. ఏ విధంగా?

అ. పాతదైన కొద్దీ అద్దె పెరుగుతుండాలి.

ఆ. గోడలులేకపోతే గోడకి 10 రూపాయల చొప్పున.

ఇ. కప్పుకపోతే 50 చొప్పున.

ఈ. నేలమట్టం లేకపోతే 100రూ.లు.

3. మరమ్మత్తులు ఎప్పుడూ తలపెట్టకూడదు. ఆ ఖర్చుతో మరో యిల్లు కట్టించి మరో సంసారం నిలబెట్టొచ్చు.

4. సాధ్యమైనంతవరకూ ఇంటాయన అద్దెకిచ్చిన వాటా దగ్గరలోనే కాపురం ఉండాలి. స్విట్జర్లాండ్, కైరో, అలాస్కా మాస్కోల కేసి మకాం చెయ్యకూడదు.

5. ఇది ఆఖరు నిబంధన.

ఇంటాయన అద్దెకున్నాయన్ని ఖూనీచేస్తే ప్రపంచ కోర్టుకి మాత్రం విచారణ చేసే అధికారం వుంది. మిగతా కోర్టులకి లేదు.

అల్లాగే అద్దెకున్నాయనకి ఇంటాయన్ని ఖూనీ చెయ్యాలన్న సంకల్పం కలిగినట్లు ఋజువైతే, ఋజువిచ్చినవాడినీ, సంకల్పం కలిగినవారినీ, వరల్డ్ కోర్టు విచారణ చేసి, ఋజువు కాకపోయినా మరణదండన విధించే హక్కుంది.

ఇది తయారు చేసిన తర్వాత మా పంచభూతాన్ని చంపడానికి నిశ్చయించు కున్నాను. దైవం కలిసొచ్చింది. ఆ ఉదయమే స్టీఫెన్ లీకాక్ అనే ఒక తోటి కాపురస్తుడు. అమెరికాలో కాలేజి ప్రొఫెసర్. న్యూయార్క్ పట్నంలో, అద్దె ఎన్నిసార్లు కోరినా ఎక్కువ చెయ్యని మిషమీద, తన ఇంటి యజమానిని పిస్తోల్‌తో కాల్చి చంపేసి పోలీసులకు పట్టుబడిపోయిన సంగతి వ్రాయడం, ఆ వ్రాసింది నే చదవడం జరిగింది. ఆ వింతగాథ ఆంధ్రదేశం మినహా ప్రపంచం అంతా చదివే ఉంటుంది.

ఈ విషయంలో నేను ఆయన వ్యాసంలో సంగతులు దొంగిలించానని అనుకోవద్దని మనవి. చంపాలన్న సంకల్పం మాత్రం అది చదివిం తర్వాత కలిగింది. మేమిద్దరం కలిసి, ఒకర్నే చంపామని కూడా అనుకోవద్దు. ఆయనకి పిస్తోల్ లైసెన్సుంది. నాకు లేదు. ఆయన మిట్టమధ్యాహ్నం హత్య చేశాడు. నేను నిశిరాత్రి చేశాను. ఆయన నేరం వొప్పేసుగున్నాడు. నే వొప్పుగోను. నేను పిరికివాణ్ణి, స్వార్థపరుణ్ణి, ప్రాణంపై తీపి జాస్తి. వెళ్ళి ఎల్లాగో ఆ పంచభూతాన్ని హత్యచేసి, రక్తం చేతులు కడుక్కున్నాను.

కొంపతీసి నిజమనుకుని నా మీద కేసు పెట్టేరు! చంపలేదండి – చంపుదామన్న కసి అంతగా ఉందన్నమాట. ఆ కసి తీర్చుకోడానికి అల్లా వ్రాశాను. అంతే!

ఇప్పటికైనా తెల్సిందా? నా స్వార్థపరత్వం ఎట్లాంటిదో!